క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు ఢీకొని రైతుకు గాయాలు



వర్ధన్నపేట: మండల కేంద్రానికి చెందిన రైతు నక్క రాజాలు ద్విచక్ర వాహనంపై యూరియా బస్తా తీసుకెళ్తుండగా అంబేడ్కర్ సెంటర్ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో వరంగల్ వైపునకు వెళ్తున్న సూర్యాపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆదివారం ఢీకొట్టింది. దీంతో రాజాలు కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఆయన్ను స్థానికులు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి పంపించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని..

నల్లబెల్లి: మండలంలోని దస్తగిరిపల్లికి చెందిన ఎల్లబోయిన కొంరయ్య ద్విచక్ర వాహనం ఢీకొని గాయాల పాలయ్యాడు. వివరాలిలా.. కొంరయ్య మండల కేంద్రంలోని తిరుమల వైన్స్‌లో పని చేస్తున్నాడు. ఆయన పని ముగించుకుని సాయంత్రం సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా మండలంలోని శనిగరం శివారులో శనిగరం వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. కొంరయ్య తీవ్ర గాయాలపాలు కాగా స్థానికులు ఆయన్ను 108 వాహనంలో నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పరామర్శ



వర్ధన్నపేట: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు వ్యక్తిగత సహాయకుడుగా పని చేస్తున్న మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన బేతి సాంబయ్యను అతడి తల్లి సుశీల ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఆదివారం పరామర్శించారు. తొలుత సుశీల చిత్రపటానికి దయాకర్ రావు, రమేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, పీఏసీఎస్ చైర్మన్ కొడగాని రాజేశ్ ఖన్నా, మార్కెట్ కమిటీ చైర్మన్ కమ్మగోని స్వామిరాయుడు, సర్పంచ్ సుంకరి సాంబయ్య, ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్వతగిరిలో..

పర్వతగిరి: మండల కేంద్రానికి చెందిన చింతపట్ల పాపారావు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రంగు కుమారస్వామి, పీఏసీఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్‌గౌడ్, ఉపసర్పంచ్ రంగు జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి



నర్సంపేట: పట్టణంలోని ఏకలవ్య కాలనీకి చెందిన పాలకుర్తి సమ్మక్క ఆదివారం మృతి చెందగా ఆమె మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఎడ్ల ప్రతాప్‌రెడ్డి, నాయకులు అప్పాల శ్రీకాంత్, గుర్రం వెంకన్న, లేదల యాకయ్య, గంగోసుల రవిచారి, రాయపురం రాజు, సామల రాజు, సంగపు భరత్‌కుమార్, గజ్జల దత్తు, మెరుగుర్తి గణేశ్, పాలకుర్తి మధు, పాలకుర్తి రాజేందర్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థినుల ప్రతిభ



గూడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులు ఆదివారం వరంగల్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి 4 వెండి, 4 కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థులను హెచ్‌ఎం స్వరూప, ఉపాధ్యాయులు సీఆర్‌పీలు శోభన్‌రెడ్డి అభినందించారు.

కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు



ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం గోదాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి సారెను అందచేశారు. అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి ప్రత్యేక పూజలు చేశారు.

ఆధ్యాత్మికతతో జీవితంలో ప్రశాంతత



సంగెం : అక్షింతలను తీసుకొస్తున్న నర్సింహారెడ్డి



గీసుకొండ : అక్షింతలను అందజేస్తున్న సర్పంచ్



చెన్నారావుపేట: అక్షింతలతో వస్తున్న భక్తులు



వర్ధన్నపేట : అక్షింతలను పంపిణీ చేస్తున్న భక్తులు

- పాట్నా హైకోర్టు మాజీ న్యాయమూర్తి లింగాల నర్సింహారెడ్డి

సంగెం: ఆధ్యాత్మికతతో జీవితం ప్రశాంతంగా సాగుతుందని పాట్నా హైకోర్టు మాజీ న్యాయమూర్తి లింగాల నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని గవిచర్లలో బీజేపీ మండల అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి ఆధ్వర్యంలో అయోధ్యలోని రామాలయంలో పూజించబడిన అక్షింతలను ఆదివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి నర్సింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రజలకు అక్షింతలు పంపిణీ చేసి మాట్లాడారు. శ్రీరాముడి అక్షింతల ప్రాశస్త్యాన్ని వివరించారు. కార్యక్రమంలో నాయకులు దొనికెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ: మండలంలోని గంగదేవిపల్లిలో సర్పంచ్ గోనె మల్లారెడ్డి ఆధ్వర్యంలో జన జాగరణ సమితి సభ్యులు అయోధ్య రామాలయ పూజిత అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. అయోధ్య ఆలయ ఫొటోను, కరపత్రాలను సైతం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లారెడ్డి మాట్లాడారు. ఈనెల 22న అయోధ్యలో బలరాముని విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని తిలకించేలా గ్రామంలోని బొడ్రాయి వద్ద ప్రొజెక్టర్‌తో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 22న సాయంత్రం ఇంటి ముందు ఐదు దీపాలు వెలిగించాలని సూచించారు. కార్యక్రమంలో జన జాగరణ సమితి అధ్యక్షుడు మాడిశెట్టి రాముడు, నాయకులు గద్దమీది బాలరాజు, గోనె ఐలయ్య, నల్ల సాంబరెడ్డి, నల్ల కుమార్, ముస్కు రమేశ్, కూసం శివ, ఎల్లబోయిన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట: మండలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో భద్రపర్చిన అక్షింతలను రామ మందిర తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈనెల 22న శ్రీసీతారాముల విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో రాత్రి ఇంటి ముందు దీపాలు వెలిగించాలని ట్రస్ట్ ప్రతినిధులు సూచించారు.

చెన్నారావుపేట: మండలంలోని పాత మగ్దుంపురంలోని హనుమాన్ ఆలయం నుంచి శ్రీ రాముడి అక్షింతలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూజారి దేవి, మాజీ ఉపసర్పంచ్ ననుమాస కరుణాకర్‌గౌడ్, ములుక ఐలయ్య, ఆకుల మనోహరస్వామి, కొండపర్తి కృష్ణమోహన్, ననుమాస పవన్‌కళ్యాణ్, కొయ్యల భాస్కర్, ననుమాస రాధిక, కవిత, నాంపెల్లి లత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

‘అభయహస్తం’ కంప్యూటరైజేషన్



సంగెం : దరఖాస్తుల నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్



చెన్నారావుపేట : డాటా నమోదును పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ

సంగెం: మండలంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభల్లో అందిన దరఖాస్తుల కంప్యూటరైజేషన్ ప్రక్రియ మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఆదివారం కొనసాగింది. మండలంలో మొత్తం 18,307 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ కాసర్ల రవీందర్ తెలిపారు. కంప్యూటరైజేషన్ ప్రక్రియను తహసీల్దార్ జి.రాజ్‌కుమార్, ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ కొమురయ్య, ఏఓ యాకయ్య పర్యవేక్షించారు.

చెన్నారావుపేట: అభయాస్తం దరఖాస్తుల డాటాను నమోదు కార్యక్రమాన్ని అధికారులు మండలంలోని జయముఖి కళాశాలలో ఆపరేటర్లతో ప్రారంభించారు. మండలంలో మొత్తం 12,944 దరఖాస్తులు స్వీకరించారు. డాటా ఎంట్రీని స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ, తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ భారతి, ఎంపీఓ శ్రీధర్‌రాజు పరిశీలించారు. డాటా ఎంట్రీ ఆపరేటర్‌లకు సూచనలు అందించారు. కార్యక్రమంలో గిర్దావర్ స్వామి పాల్గొన్నారు.

గురువుకు చేయూత



చెన్నారావుపేట: తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు (ఉపాధ్యాయుడు)కు పూర్వవిద్యార్థులు చేయూత అందించి ఆదర్శంగా నిలిచారు. మండలంలోని ఎల్లాయగూడెం గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసి అతడి వద్ద చదువుకున్న బోడమాణిక్యం తండాకు చెందిన పూర్వవిద్యార్థులు బోడ వెంకన్న, బోడ రవి, భూక్య సురేందర్ ఆదివారం ఆర్థికసాయంతోపాటు క్వింటా బియ్యం అందజేశారు.

వేడుకగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



కేక్ కట్ చేస్తున్న పూర్వవిద్యార్థులు

నెక్కొండ: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1997–98 విద్యాసంవత్సరంలో 10వ తరగతి అభ్యసించిన విద్యార్థులు మండల కేంద్రంలోని మహేశ్వర గార్డెన్స్‌లో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. కేక్ కట్ చేశారు.వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడిన నాటి పూర్వవిద్యార్థులు తమ మిత్రులను ఒకరికొకరు పరిచయం చేసుకుని నాటి జ్ఞాపకాలను జ్ఞప్తికి తెచ్చుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాసిన మాధవ్, మోహన్, కల్పన, రఫీ, రాజేందర్, రవి, చంద్రమౌళి, రాంబాబు, సంగీత, మాధురి, రజిత, సదానందం తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నర్సంపేట: పట్టణంలోని ప్రజ్ఞ ఆచార్య డిగ్రీ కళాశాలలో శ్రీరామానుజ ఫిలిసోఫికల్ ఫౌండేషన్ ట్రస్ట్ క్యాలెండర్‌ను చాత్తాద శ్రీవైష్ణవ సంఘం నర్సంపేట శాఖ అధ్యక్షురాలు దాస్యం రూపావతి, కార్యవర్గ సభ్యులు ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌మూర్తి, పరాంకుశం శ్రీనివాస్, తిరుక్కోవల్లూరి అంజలి, ఎస్వీ.శ్రీనివాస్, సంతోశ్, రమ్య, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

సంగెం: మండలంలోని ఎల్లుగూర్‌రంగంపేట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, సర్పంచ్ పోతుల ప్రభాకర్, మాజీ సర్పంచ్ పెద్దగోని లక్ష్మినారయణ, మత్స్య సహకార సంఘం మాజీ చైర్మన్ బోనాల శ్రీనివాస్, యూత్ కన్వీనర్ గడ్డం రవి, నాయకులు బోనాల సతీశ్, ఉప్పల స్వామి, బందెల అయిలయ్య తదితరులు హనుమకొండలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నివాసంలో శనివారం రాత్రి కాంగ్రెస్‌లో చేరారు. వారికి రేవూరి ప్రకాశ్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, నాయకులు జనగాం రమేశ్‌గౌడ్, అచ్చ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నెక్కొండ: నేడు (సోమవారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశానికి సమగ్ర నివేదికలతో సంబంధిత అధికారులు హాజరు కావాలని సూచించారు. గౌరవ సభ్యులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజల మన్ననలు పొందాలి



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిధులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

తొర్రూరు రూరల్/తొర్రూరు: ప్రజాసేవ కార్యక్రమాలను మరింత విస్తరింప చేస్తూ వాసవి క్లబ్ తొర్రూరు అన్నివర్గాల ప్రజల మన్ననలను పొందాలని పాలకుర్తి ఎమ్మెల్యే హనుమాండ్ల యశస్వినిరెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని వెలికట్ట గ్రామ శివారులోని రామ ఉపేందర్ గార్డెన్‌లో నిర్వహించిన క్లబ్ నూతన ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో యశస్విని రెడ్డి మాట్లాడారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన బిజ్జాల అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా చౌడవరపు రాము, కోశాధికారిగా వల్లపు మధులతోపాటు వాసవి అన్నపూర్ణ, వాసవీ కపుల్స్ క్లబ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ యాద నాగేశ్వర్‌రావు, మాజీ అధ్యక్షులు వజినపెల్లి దీపఅనిల్‌కుమార్, మచ్చ సురేశ్, విశ్వప్రకాశ్, రేవూరి శ్రీనివాస్, లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన నాయకులు

గూడూరు: మండలంలోని మద్రిమిట్టకు చెందిన కాంగ్రెస్ నాయకులు యొట్టి వెంకన్న తన అనుచరులతో కలిసి ఆదివారం కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మానుకోట ఎంపీ అభ్యర్థిగా తన బయోడెటాను అందించినట్లు వెంకన్న తెలిపాడు.

ప్రభుత్వ సాయం అందేలా చూస్తా..

కొత్తగూడ: మండలకేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాజం సారంగంను సీతక్క కోడలు కుసుమాంజలి ఆదివారం పరామర్శించారు. చికిత్సకు కావాల్సిన సాయం మంత్రి సీతక్క సహకారంతో ప్రభుత్వం ద్వార అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఆమె వెంట సర్పంచ్ మల్లెల రణధీర్ ఉన్నారు.

‘కార్యకర్తలు అధైర్యపడొద్దు’



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు : నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు అధైర్యపడొద్దని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సూచించారు. హనుమకొండలోని ఆయన స్వగృహంలో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదేళ్ల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ పాలన కొనసాగిందని అన్నారు. గెలుపోటములు సహజమని, కార్యకర్తలు నిరాశ పడొద్దని అన్నారు. రాబోయే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజలు గుర్తిస్తారని ఆశించారు. ఈ సమావేశంలో నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

దామెర: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు గుర్తించి బాధితుడికి అప్పగించారు. వివరాలిలా.. మండలంలోని ఊరుగొండ గ్రామానికి చెందిన తక్కళ్ల కేదారీశ్వర్ గత నెల 19వ తేదీన ఊరుగొండ నుంచి హనుమకొండకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. కాగా డిసెంబర్ 21న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దామెర ఎస్సై కొంక అశోక్ సెల్ ఫోన్ ఆచూకి గుర్తించి కేదారీశ్వర్‌కు అప్పగించారు. దీంతో పోగొట్టుకున్న తన సెల్‌ఫోన్‌ను తనకు అప్పగించిన ఎస్సై అశోక్‌కు, సిబ్బందికి కేదారీశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు. సీఈఐఆర్ గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ఎస్సై సూచించారు. మొబైల్ పోగొట్టుకుంటే వెంటనే స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేయాలని, పోలీసుల సలహాలు తీసుకోవాలని అన్నారు. సీఈఐఆర్ పోర్టల్‌తో మొబైల్ ఎక్కడ ఉందో తెలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్సైలు సిద్దయ్య, రాజు, హెడ్ కానిస్టేబుల్ యాకయ్య, సిబ్బంది శ్రీనివాస్, మధు, రమేష్ ఉన్నారు.

‘కేంద్ర’ పథకాలతో పేదలకు లబ్ధి



వికసిత్ సంకల్ప యాత్ర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గోవింద్, తదితరులు

- యూనియన్ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ గోవింద్

సంగెం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి చేకూరుతుందని యూనియన్ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ గోవింద్ చౌహాన్ తెలిపారు. నోడల్ ఆఫీసర్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ యాకర అనిల్ ఆధ్వర్యంలో మండలంలోని పోచమ్మతండ, వీఆర్‌ఎన్ తండ గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్ చౌహాన్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం ఉజ్వల యోజన, పీఎం ముద్ర యోజన, సుకన్య సమృద్ధి యోజన, పీఎం జీవనజ్యోతి యోజన, సురక్ష బీమా యోజన వంటి పథకాలను గ్రామస్థాయిలో ప్రజలకు చేర్చేలా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఏటా రూ.6 వేలు, ఆహార భద్రత పథకం కింద రేషన్ కార్డు కలిగిన కుటుంబాల్లోని సభ్యులకు నెలకు 5 కేజీలు చొప్పున బియ్యం ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని కోరారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించే క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గుగులోత్ రమాదేవి, బిచ్చానాయక్, సీసీ బొజ్జ సురేశ్, ఏఎన్‌ఎం మెర్సమ్మ, ఆరోగ్యమిత్ర బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వండి



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అన్వేశ్

సంగెం: ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సన్ లైఫ్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనంతుల అన్వేశ్ కోరారు. మండలంలోని వంజరపల్లిలో ఆ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్వేశ్ మాట్లాడారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. మాస్కులు ధరించి కరోనాకు దూరంగా ఉండాలని చెప్పారు. జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కరోనాకు దూరంగా ఉండొచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంతల స్రవంతి అనిల్, నాయకులు కొడగాని శంకర్‌రావు, యుగేందర్, సోమిడి శ్రీనివాస్, మల్లేశం, సాంబయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 3 నుంచి జాతీయ మహాసభలు



మాట్లాడుతున్న డివిజన్ కార్యదర్శి రాజు

చెన్నారావుపేట: మార్చి 3 నుంచి 5 వరకు ఖమ్మం జిల్లా కేంద్రంలో విప్లవ కమ్యూనిస్టు పార్టీల ఐక్యతా జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నర్సంపేట డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు తెలిపారు. మండలంలోని ఈర్య తండాలో ఆదివారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కుల మతోన్మాద ఫాసిస్టు నిరంకుశ విధానాలు పౌరుల ప్రజాస్వామిక హక్కులకు భంగం కలిగిస్తున్నాయని చెప్పారు. దేశ లౌకిక వ్యవస్థ ప్రమాదంలో పడుతోందని ఆందోళన వెలిబుచ్చారు. భిన్నత్వంలో ఏకత్వంతో కలిసి మెలిసి జీవిస్తున్న ప్రజల నడుమ విభేదాలు సృష్టిస్తూ దుష్టపాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. దేశ సంపదను విదేశీ సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వర్గాలకు కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. మోదీ నిరంకుశ పాలనను అడ్డుకోవాలని సూచించారు. జాతీయ మహాసభలకు దేశవ్యాప్తంగా సుమారు 5 వేల మంది ప్రతినిధులు హాజరౌతారని చెప్పారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు శేఖర్, రాజిరెడ్డి, నవ్య, కమ్లి, ఈరమ్మ, జంపన్న, తదితరులు ఉన్నారు.

23 నుంచి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు



సమావేశంలో కొమురారెడ్డి, గ్రామస్తులు

- ఆలయ కమిటీ చైర్మన్‌గా సాంబరెడ్డి ఎన్నిక

గీసుకొండ: మండల కేంద్ర సమీపంలోని నల్లరాతి గుట్టపై ఈనెల 23 నుంచి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు చాడ కొమురారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆలయ కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఏనుగుల సాంబరెడ్డి, వైస్ చైర్మన్లుగా చాడ సంజీవరెడ్డి, కందికొండ మొగిలి, ప్రధాన కార్యదర్శిగా కోల వేణు, కోశాధికారిగా బోడకుంట్ల రాజు, ప్రచార కార్యదర్శిగా బండారి నరేందర్, పలు కులాల నుంచి 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు దౌడు భరత్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుతాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్

- మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్

ఐనవోలు : రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటుతామని బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ తెలిపారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఐనవోలు, వర్ధన్నపేట బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు నా గెలుపు కోసం కష్టపడ్డారని, చిన్న తప్పిదాలతో ఓడిపోయామన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజం అన్నారు. ఉద్యమ పార్టీకి పోరాటాలు చేయడం కొత్తకాదని, గతంలో తమ పార్టీ నాయకులు పదవులను గడ్డిపోచలాగా వదిలేశారని అన్నారు. కార్యకర్తలు ఎవరు అధైర్యపడొద్దన్నారు. నిరంతరం ప్రజల్లోనే ఉంటూ అందరికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఓటమి తప్పిదాలు తెలుసుకుని రానున్న ఎన్నికల్లో మళ్లీ తప్పదాలు జరగకుండా జాగ్రత్తపడాలని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారంపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, జెడ్పీవైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, ఎంపీపీలు మధుమతి, అప్పారావు, జెడ్పీటీసీ భిక్షపతి, జిల్లా ఆత్మ చైర్మన్ గోపాల్‌రావు, జెడ్పీ కో ఆప్షన్ ఉస్మాన్ అలీ, పీఏసీఎస్ చైర్మన్ రాజేష్‌ఖన్నా, స్వామి రాయుడు, మోహన్, పాల్గొన్నారు.

చెరువులు, కుంటలను పరిరక్షించాలి

మామునూరు: మత్స్యకారుల జీవనాధారమైన చెరువులు, కుంటలను పరిరక్షించాలని అల్లీపురం గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పిట్టల కుమారస్వామి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు బుస్స వెంకటేశ్వర్లు, కులపెద్దలు కోరారు. అన్యాక్రాంతమవుతున్న వీరోజు కుంటను అధికారులు కాపాడాలని సూచించారు. ఖిలా వరంగల్ మండలం అల్లీపురం గ్రామ శివారు సర్వే నంబర్ 110లోని వీరోజుకుంటను ముదిరాజ్, మత్స్యపారిశ్రామిక సంఘం కార్మికులతో కలిసి సంఘ కార్యవర్గ ప్రతినిధులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆక్రమణకు గురవుతున్న వీరోజుకుంటను పరిశీలించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బొల్ల బాబు, గుర్రం లక్ష్మీనారాయణ, శీలం సాంబయ్య, బండి మోహన్ బాబు, లక్క కుమారస్వామి, గుర్రం ఉపేందర్, యాదగిరి, పిట్టల సాంబయ్య, బొల్ల రాజు, కేశబోయిన కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.